
*మానవ ప్రయత్నాలకు దక్కే ఫలితాలు కొన్నుంటాయి. మానవాతీత శక్తేదో నడిపిస్తేగానీ జరగని పనులుంటాయని కొందరి నమ్మకం. ఈ నమ్మకానికి, ఇప్పుడున్న వైద్య పరిజ్ఞానానికి మధ్య పిల్లలు కలగక నలిగిపోతున్న ఒక దంపతుల కథ ఇది. పట్టు వదలకుండా ప్రయత్నించడమనేది మెడకు ఉచ్చులా బిగుసుకుంటే ఎలా ఉంటుందోనన్న ఆలోచన ఈ కథకు ప్రేరణ.*

పూర్ణిమ తమ్మిరెడ్డి

# 11

# 1+1





*ఐ యామ్ ఎ మాన్!*
*మై స్పర్మ్ కౌంట్ ఈజ్ గుడ్!*
*అండ్, దట్ ఈజ్ మై సిన్!*
*6:01 PM*

తన్నుకొస్తున్న ఆవేశాన్ని గొంతులో నొక్కేసి, రెండు బొటనవేళ్లలో బలాన్నంతా మొబైల్ కీబోర్డుపై చూపించి, ఆ మెసేజ్ వాట్సాప్ చేశాడు. ఒక క్షణం ఆగి చూశాడు. మెసేజుల పక్కన ఒక టిక్ మార్క్ వచ్చింది. వెంటనే రెండోది కనిపించింది. అవి నీలంరంగులోకి మాత్రం మారలేదు. నిట్టూర్చి, ఇంకా ఏదో టైపు చేయడం మొదలు పెట్టాడు. అనుకుంటున్నవన్నీ అనటానికి ఆటో కరెక్ట్ అడ్డుపడింది. గొంతులో అణిచి ఉన్న ఆవేశం 'ఫక్'గా తప్పించుకుంది. సోఫాలో రెండు పల్టీలు కొట్టి కుషన్ల మధ్య ఖాళీలో ఫోన్ దాక్కుంది.

సోఫా ముందున్న కాఫీ టేబుల్ మీదకు కాళ్లు చాచి, కాలితోనే ఎదురుగా వున్న మాక్‌బుక్‌ను ఒక పక్కకు నెట్టి, కళ్లు మూసుకున్నాడు.

ఇంతలో ఫోన్ గుర్రుమంది, నొక్కేసిన గొంతుతో. కదలకుండా అలానే ఉండి చేతులతో వెతికాడు. పక్కకు వంగితేగాని దొరకలేదు. సైలెంట్ మోడ్‌లో పెట్టబోతుంటే లాక్ అయ్యున్న స్క్రీన్ మీద సంధ్య పేరు కనిపించింది. ఒక్కసారిగా తల ఎత్తి కూర్చున్నాడు. వచ్చిన మెసేజ్ ఏంటో చూసుకోకుండా ఆమెకు తను పెట్టిన మెసేజిలు చదువుకున్నాడు. అందులో స్పర్మ్ ప్రస్తావన లేదని నిర్ధారించుకొని ఊపిరి తీసుకున్నాడు.

*బావా! మీ ఇద్దరి గురించి బెంగగా ఉంది.*
*డోంట్ టార్చర్ యువర్ బాడీస్ ప్లీజ్*
*6:09 PM*

ఫోన్ని బోర్లా తిప్పి గుండెలపై పెట్టుకున్నాడు. ఎనిమిది నెలల క్రితం ఫామిలీ గెట్టుగెదర్‌లో కూడా సంధ్య ఇలానే ఏదో అంది, పిల్లలు లేకపోతేనేం? దత్తత తీసుకోవచ్చుగా! అని. అంతే! వాళ్లమ్మ కొట్టినంత పనిచేసింది. అతడి అమ్మానాన్నలు కళ్లతోనే కసిరారు. 'ఏం? తన పిల్లల్ని అక్కకి ఇచ్చేస్తుందటనా?' అని చుట్టాల్లో కొందరు వినిపించేట్టు గుసగుస లాడారు. ఆరోజు ఆ మాట విని అక్కడ నుండి వెళ్లిపోయిన అతడి భార్య మళ్లీ చెల్లెలితో మాట్లాడలేదు.

ఫోన్ చేతిలోకి తీసుకుని మళ్లీ వాట్సాప్ తెరిచి చూశాడు. విజయ్ నుంచి రిప్లయ్ లేదు. ఇంజనీరింగ్ హాస్టల్లో ఒకే గది పంచుకున్నవాళ్లు. నాలుగేళ్లు అయ్యాక ఆ గదిని కూడా తమతో పాటు మోసుకెళ్లినవాళ్లు. దూరభారాల మీద ఫోనుల్లో మాట్లాడుకోవడం, లైట్లు ఆపేసి, ముసుగులు తన్నేశాక చీకట్లో కబుర్లు చెప్పుకున్నట్టు అనిపిస్తుందిగానీ మెసెంజర్లలో మాట్లాడుకోవడం మాత్రం ఒకళ్లు గదిలో లేనప్పుడు ఇంకోళ్లకి కాగితం మీద రాసి పెట్టి వెళ్లిన మెసేజెస్‌లా ఉంటుంది. ఏదో అత్యవసర విషయం చెప్పడానికే కానీ, మనసులో మాట చెప్పుకోడానికి కుదరదు.

'విజయ్ టైపింగ్' వాట్సాప్ చూపించింది. మొబైల్లో టైపింగ్ కష్టమని పక్కకు పెట్టి మాక్ బుక్ తీసుకున్నాడు. ఇంకేమన్నా మెసేజులు వస్తాయేమోనని ఎదురు చూశాడు. తాను పంపిన మెసేజులు మళ్లీ చదువుకుని మొహం పక్కకు తిప్పేసుకున్నాడు. ఇందాకటి ఆవేశమంతా నీరుకారిపోయింది. వాట్సాపులో స్టేటసు ఇంకా మారలేదు. మాక్ మూసేసి బయటకు చూశాడు.

బయట చిన్నగా చీకటి పడుతోంది. లేచి బాల్కనీకి ఉన్న గ్లాస్ డోర్ తీయబోయాడు. అది జరగలేదు. బలంగా లాగాడు. ఆన్‌సైట్‌లో ఉండగా ఇంట్లో అద్దెకు ఉన్నవాళ్లు అప్పుడే నడక వస్తున్న పిల్లాడికోసం అతి జాగ్రత్తతో, బాల్కనీ తలుపు తెరిచేవాళ్లు కాదు. వాడకం లేక తలుపు బిగుసుకుపోయింది.

ప్లే గ్రవుండ్లో లైట్లు వెలుగుతున్నాయి. ఆడింది చాలని పిల్లల్ని ఇళ్లల్లోకి లాక్కుపోతున్న తల్లిదండ్రులు. ప్లే గ్రవుండ్ ఎదురుగా ఉండే అపార్ట్‌మెంటు కోసం అప్పట్లో ఎక్కువ డబ్బులు పోసి కొన్నారు. పెళ్లయిన ఏడాదికే తీసుకున్న ఫ్లాట్. ఆఫీసు నుండి ముందుగా అతడే ఇంటికి చేరుకునేవాడు. గంటన్నర ప్రయాణంచేసి వచ్చే ఆమె కోసం తినడానికి ఏదో ఒకటి చేసిపెట్టి, బాల్కనీలో ఎదురు చూస్తుండేవాడు, ఆడుకునే పిల్లల్ని చూస్తూ. ఆమె ఇంటికి వచ్చాక, అతను చేసిన పకోడీలో, శాండ్విచో తింటూ, 'పిల్లలకు నీ పోలిక వస్తే, మాస్టర్ చెఫ్ అవ్వడం ఖాయం,' అనేది. 'ఏమన్నా అవనీ గాని, కొడుకు పుడితే సచిన్ అని, కూతురు అయితే శచి అని పేరు పెడతా,'నని అనేవాడు. వాళ్ల అమ్మలు దాన్ని కాస్తా సాయి వెంకట సచిన్‌గా మార్చేస్తారని ఉడికించేది ఆమె. 'పిలుచుకోమను పర్లేదు, రిజిస్టర్లో రాయనియ్యను. పిల్లలకి ఊహ తెలిశాక, సచిన్ ఇండియాలో ఆడే మ్యాచులన్నింటికి తీసుకెళ్తా,' అంటుంటే అతని కళ్లు మెరిసేవి. వరల్డ్ కప్ తర్వాత సచిన్ ఆడడేమో అని గుర్తుచేసేది ఆమె. 'రైట్! అవును కదా. పద పద, టైమ్ లేదు మన దగ్గర,' అంటూ ఆమెను దగ్గరకు తీసుకునేవాడు. 'ఏంటిది బాల్కనీలో, ఎవరన్నా చూస్తే,' అంటూ విడిపించుకునేది నవ్వుతూ, లోపలికి నడుస్తూ.

పట్టుకున్న బాట్‌లో సగం హైట్ కూడా లేని పిల్లలంతా, ఇప్పుడు అండర్ 10 టోర్నమెంట్స్‌లో ఆడుతున్నారు. పట్టుకున్న బాట్‌లో సగం హైట్ కూడా లేని పిల్లలు కొత్తగా వస్తూనే ఉన్నారు.

ఫోన్ రింగయింది. అమ్మ. కాల్ తీసుకోలేదు. వాట్సాప్‌లో కదలిక, విజయ్ నుండి.

*ఆర్ యూ ఓకే? కెన్ ఐ కాల్?*
*7:23 PM*

*కుదరదు. పక్క గదిలోనే ఉంది.*
*7:23 PM*

*అబే గిరీ నువ్వు ఇష్యూని ఇంకా పెద్దది చెయ్యకురా.*
*డాక్టర్‌తో మాట్లాడి, కొంచెం బ్రేక్ తీసుకోవచ్చుగా.*
*7:24 PM*

*ఒప్పుకోదురా.*
*7:24 PM*

*మళ్లీ ఉద్యోగంలో చేరమని చెప్తూనే ఉన్నా...*
*7:26 PM*

*అవ్వదురా! జాబ్ వల్లే ఇదంతా అంటుంది. షి ఈజ్*
*7:26 PM*

గాజుల చప్పుడు, సెల్‌ఫోన్ రింగ్ దగ్గరవ్వటంతో హోమ్ బటన్ నొక్కాడు తక్కున. దాటకూడని గీతున్నట్టు ఆమె ఇవతలి నుండే ఫోన్ అందించింది. అతడే బాల్కనీ తలుపు దగ్గరకు వచ్చాడు. 'అత్తయ్య కాలింగ్' కనిపించింది ఆమె ఫోనులో.

"ఆఁ, అమ్మా, చెప్పు."

"అమ్మనేరా! కనీసం, నా ఫోను కూడా తీయలేవురా?!"

"ఫోను సైలెంట్‌లో ఉందమ్మా. నేనేదో పనిలో ఉన్నా," విసుగు వినపడకుండా సంజాయిషీ ఇవ్వడం ఎందుకింత కష్టం. ఎందుకీ అవసరం.

"అంతే! మీకెంతసేపూ పనులే! మీ జీవితాలు బాగవ్వాలని మేం కిందా మీదా పడాలిగానీ, మీకేం పట్టింది?"

అతడు బాల్కనీలోంచి ఇంట్లోకి వచ్చాడు. ఆమె అడుగులో అడుగు వేసుకుంటూ, డైనింగ్ టేబులు చేరుకుంది. టేబులు మీదున్న ప్రసాదం బాగులోంచి కొబ్బరి చెక్కలు తీసి బయటపెట్టింది.

"స్పీకర్‌లో పెట్టు. ఇద్దరితో మాట్లాడాలి."

"దేని గురించి?"

అతడూ మెల్లిగా నడుస్తూ డైనింగ్ టేబుల్ చేరుకున్నాడు. కుర్చీ లాక్కుని కూర్చుంటూ స్పీకర్ ఆన్ చేసి, ఫోన్ టేబుల్ మీద పెట్టాడు.

"మీ నాన్నా, నేనూ మొన్న ఒక బాబాగారిని కలిశామని చెప్పాను కదా!" అతడు భుజాలు జారిపోయాయి. సగం మొహం చేతిలో దాచుకున్నాడు. ఆమె తల ఎత్తకుండా కొబ్బరి చెక్కల్లోంచి కొబ్బరి తీస్తోంది, ముక్కలుగా.

“మీ జాతకాలు చూపించాం. ఏ దోషమూ లేదు. దేవుడు పరీక్ష పెడుతున్నాడంటే గొప్ప వరమే ఇవ్వబోతున్నాడు అని అన్నార్రా ఆయన!”

ఆమె కొబ్బరిని చాకుతో చిన్న చిన్న ముక్కలుగా కోయడం మొదలుపెట్టింది.

“ఆయన రేపు హైదరాబాదులోనే ఉంటారు. మీరిద్దరూ వెళ్లి కలవండి.”

“రేపా? రేపంటే ఎలా అమ్మా. ఇవ్వాళ చిత్రకి మళ్లీ టెస్టులు చేశారు మధ్యాహ్నం అంతా. పొద్దున్న గుడికెళ్లి 108 ప్రదక్షణలు చేసొచ్చాం. ఇద్దరం అలసిపోయున్నాం.”

“నూటఎనిమిది కాకపోతే, వెయ్యిన్నూట పదహార్లు చెయ్యండి! నేను పొమ్మన్లేదే! అది వీసాలొచ్చే గుడి. పిల్లల కోసమని ఎవరూ వెళ్లగా నేను వినలేదు. మళ్లీ పారిపోయే ఉద్దేశాలు ఉన్నాయేమో మరి మీకు!”

ఆమె చేతిలోని చాకు ఆగింది. ఆ గుడికి వెళ్లమంది చిత్ర వాళ్ల అమ్మ అని గుర్తొచ్చి నాలుక కర్చుకున్నాడు. స్పీకర్ ఆఫ్ చేశాడు.

“సరే! ఎక్కడ?”

“చాంద్రాయణగుట్టలో. మీ నాన్న అడ్రస్ మెసేజ్ చేస్తారు. ఐదింటికల్లా అక్కడ ఉంటే స్పెషల్ దర్శనం కుదురుతుందని ఆ సెక్రటరీ చెప్పాడు.”

“ఐదింటికా! గంటన్నర దూరం మాకు,” అన్నాడు, కాలు ఒత్తుకుంటూ. అవతలివైపు నుంచి అసహనంగా మౌనం.

వెంటనే సర్దుకొని, “సరే! వెళ్తాంలే,” అంటూ కాల్ కట్ చేశాడు.

ఇంతలో తన ఫోన్‌లో విజయ్ నుండి మెసేజ్. సారీ రా! అర్జున్‌ని సాకర్‌కి తీసుకెళ్లాలి. మళ్లీ మాట్లాడతా.

రెండు ఫోన్లు టేబుల్ మీదే పడేసి, స్టవ్ దగ్గరకు వెళ్లాడు. అప్పటికే చట్నీకి కావాల్సిన పోపు చిటపటలాడుతోంది. గరిటెకి, గిన్నెకి మధ్య పోట్లాట జరుగుతున్నట్టు శబ్దాలు. కారుతున్న టాప్‌లోంచి నీళ్లచుక్కలు నీరు ఆగిపోయిన సింకులో టప్ టప్ అంటూ పడుతున్నాయి.

నీళ్లు వెళ్లడానికి ఆమె ఒక పుల్లతో పొడుస్తోంది డ్రెయిన్ కన్నాలలోకి. అతడు స్టవ్ దగ్గరకు వెళ్లాడు. ఆమె పుల్లతో కసిగా విసురుగా పొడుస్తోంది. నీరు పోలేదు. చేతిలో పుల్ల సింకులోకి విసిరేసి చటుక్కున కింద పైపు లాగడానికి వంగబోయింది. అతడు ఒక్క అడుగులో ఆమెను చేరుకొని, పట్టుకొని కూర్చీలో కూర్చోబెట్టాడు. ఆమె కళ్లు మూసుకొని అలానే ఒక నిమిషంపాటు ఉండిపోయింది. లేచి, చేతులు కడుక్కొని, అతడి చేతిలోంచి గరిటె తీసుకుని, కొబ్బరి ముక్కలతో పాటు పోపు మిక్సీలో వేసింది.

అతడు వచ్చి సోఫాలో వాలాడు. కళ్లు మూసుకొని నుదుటి మీద చేయి అడ్డంగా పెట్టుకొన్నాడు.

మిక్సీ మోత ఆగుతూ మొదలవుతూ ఆగుతూ. అతడికి తల బరువుగా అనిపించింది. కళ్లు మండుతున్నాయి. ఆమె మిక్సీ ఆపింది, మళ్లీ ఆన్ చేసింది. బహుశా, కొన్ని నీళ్లు పోసిందేమో గరగర తగ్గింది.

తన ఆలోచనల్లో కూడా ఎవరన్నా కాసిన్ని నీళ్లు పోస్తే తల ఇంత గోలగా ఉండదు కదా అని అనుకున్నాడు.

"గిరీ, గిరీ!" అని పిలుపు. మెత్తని చేయి అతని తల నిమిరిన భావన. కుక్కర్ విజిల్ లీలగా వినిపించింది.

అతడికి మెలకువ వచ్చింది. కళ్లు తెరిచి చూశాడు, లేచి కూర్చుంటూ. తల మీద చెయ్యి వేసేంత దగ్గరగా లేదు ఆమె.

కాఫీ టేబుల్‌కి అటే నిలబడి వేళ్లని ముద్దలా నోటి దగ్గర పెట్టుకొని సైగ చేసింది. అతడు వాల్చిన తల ఎత్తకుండా ఆమెనే చూశాడు. ఆమె క్షణంపాటు చూసి, కళ్లు పక్కకు తిప్పేసుకుంది.

మొహం మీద చిలకరించుకున్న నీళ్లు సరిపోలేదు. వెళ్లి షవర్ కింద నిలబడ్డాడు. పట్టేసిన నరాల మీద వేన్నీళ్లు పడుతుంటే కొద్దిపాటి ఊరట కలిగింది.

అతడు డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చేసరికి కుక్కర్ మళ్లీ స్టవ్ ఎక్కింది.

"రేపు ఎప్పుడు బయలుదేరాలి?" ఆమె అడిగింది అనునయంగా.

"ఐదింటికి అక్కడ ఉండాలంటే నాలుగింటికల్లా బైటపడాలి."

"నీరసంగా ఉందా?" అంటూ అతడి చేతిని నిమిరింది. చేతినిండా ఎర్రని గాజులు. అవి వేసుకుంటే ఫలితం ఉంటుందని చెప్పారు. ఎవరో అతడికి ఠక్కున గుర్తురాలేదు. ఆ ఎరుపును తప్పించుకోడానికి ఆమెను చూశాడు.

ఉబ్బిన మొహం. కళ్ల కొసల్లో ఎరుపు. చెదిరిన జుట్టు.

"నీకు బాలేకపోతే మానేద్దాం. అమ్మను మానేజ్ చేయొచ్చు."

"ముందు ఆవిడ కాల్స్ మిస్ అవ్వకు. అదేదో నేను ఎత్తనివ్వటం లేదన్నట్టు మాట్లాడుతుంది."

"... ... ..."

ఆమె లేచి, సింకులో కంచం పడేసి, టేబుల్ మీద ఉన్నవన్నీ ఫ్రిడ్జ్ లోపల పెట్టేసి, అక్కడ నుండి వెళ్లిపోయింది.

చేయి ఎండిపోయేవరకూ అక్కడే కూర్చుండిపోయాడు.

ఫోన్ పదేపదే మోగడంతో, చేయి కడుక్కొని, ఫోనుతో పాటు సోఫాలో కూర్చున్నాడు. వాట్సాపులో టీమ్ గ్రూప్ అంతా కంగ్రాట్స్‌తో నిండిపోతోంది. మూడేళ్ల క్రితం తను కాంపస్‌లో సెలెక్ట్ చేసిన అబ్బాయికి బాబు పుట్టాడు, ఆ సాయంత్రమే. పాపాయి ఫోటోతో పాటు, 'ఇట్స్ ఎ బాయ్ ఫర్ వినీత్. బోత్ మదర్ అండ్ బేబీ ఆర్ డూయింగ్ ఫైన్!' అంటూ టీమ్ లూప్ చేస్తూ అఫీషియల్ మెయిల్ పెట్టాడు,

మానేజర్ కాబట్టి. కంపెనీ తరపున ఇచ్చే గిఫ్ట్ వోచర్లు అతడికి పంపించాడు. 'కంగ్రాట్స్! రేపు మాట్లాడుకుందాం' అని మెసేజ్ పెట్టబోయి, కాల్ చేశాడు. "నాకు ముట్టుకోవాలన్నా వణుకు వచ్చేస్తుంది సర్!" ఆ అబ్బాయి గొంతులో సంతోషం, ఆత్రం. "వర్క్ గురించి ఆలోచించకు. టేక్ యువర్ టైమ్. కంగ్రాట్స్ అగైన్!" అని పెట్టేశాడు.

చాలామందికి పిల్లల్ని కనటం ఒకటికి ఒకటి కూడినంత తేలిక. వాళ్లకి మాత్రం ఎందుకో మరి అంతు తేలని లెక్కలా  అయిపోయింది. వారం క్రితం కఫెటేరియాలో కనపడ్డ వైస్ ప్రెసిడెంట్ గుర్తొచ్చాడు. వాడూ వాడి ఈగోయిస్టికల్ ఆటిట్యూడూ. "గిరికేంటి బాస్! మనకులా అడ్మిషన్లు, ఫీసుల గొడవలేదు. అసలు ఖర్చేముంటుంది పిల్లలు లేకపోతే?" అంటాడు పక్కనున్న కొలీగ్సుతో.  కోపం ఆపుకొని భుజాలెగరేసి ట్రే తీసుకొని వేరే టేబుల్ దగ్గరికి వెళ్లిపోయాడు. చిత్ర చెప్పేది కాదుగాని ఇలాంటి సూటిపోటి మాటలు ఆమెకూ రోజూ అలవాటే! ఉద్యోగం చేసినప్పుడు ఒకరకంగా, అది మానేసేక ఇంకో రకంగా.

మూగబోయిన టి.వి.లో  తొమ్మిదింటి వార్తలు కనిపిస్తున్నాయి. బెడ్రూము నుండి ఏ చప్పుడూ లేదు. ఏ చిన్న కదలిక అయినా, ఆమె గాజుల గలగలల వల్ల తెలిసిపోతుంది. గాజుల గురించి కొన్ని వివరాలు గుర్తొచ్చాయి. అవి వేసుకొని ఏడు మంగళవారాలు గుళ్లో దానాలు చేయాలన్నారు. ఎవరు? ఎవరో.

సింకులో కారుతున్న నీటి చుక్కల శబ్దం అతని తల మీద సుత్తిపోటులా ఉంది. లేచి వెళ్లి, సింకు కింది పైపు ఊడదీసి శుభ్రం చేశాడు. సింక్‌లో నిలిచిపోయిన నీళ్లన్నీ బుడబుడమంటూ వెళ్లిపోయాయి. టాపుని బలమంతా ఉపయోగించి మూయడానికి ప్రయత్నించాడు. అయినా చుక్కలు పడుతూనే ఉన్నాయి.

మళ్లీ టి.వి. ముందుకొచ్చి కూర్చున్నాడు. క్రికెట్ హైలైట్స్ వస్తున్నాయి. ఫోన్ తీసి టు-డూ ఆప్‌లో ప్లంబర్‌కి కాల్ చేయాలని నోట్ చేసుకున్నాడు. మరుసటి ఉదయం బాడ్మింటన్ ఆడడానికి వెళ్లాలని గుర్తుచేసింది. ఇగ్నోర్ కొట్టాడు. ఆప్ నుండి బయటకు రాబోతుంటే పొరపాటున అనలటిక్స్ లింక్ మీదకి వేలు వెళ్లింది. హాస్పిటల్ రిలేటెడ్ ఐటమ్స్ 73.

గుళ్లూ గోపురాలు, బాబాలు, ఫకీర్ల లిస్ట్ పెట్టుకోలేదింకా. లేకపోతే, వాటికి కేటాయించిన సమయమేం తక్కువ కాదు. జాతకాల్లో దోషం కనిపించదు. మెడికల్ రిపోర్ట్స్‌లో అవకాశమే లేదని చెప్పగలిగేంత ఇష్యూ కనిపించదు. 'అయ్యా, ప్రతి షష్ఠినాడు, మీరు పసుపు రంగు వస్త్రాలు ధరించి గుళ్లోని రావిచెట్టు చుట్టూ ప్రదక్షణాలు చేసినట్టయితే, మీకు తప్పకుండా వంశోద్ధారకుడు పుడతాడు!' అంటాడు పూజారి. 'మిస్టర్ అండ్ మిసెస్ గిరీ, ఈ ప్రొసీజర్ ప్రయత్నించి చూద్దాం. మీరు ధైర్యంగా ఉండాలి!' అంటుంది డాక్టరు. కొంత రహస్యంగా ప్రయత్నించిన ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ సక్సెస్ కాలేదు. ఇన్విట్రో ఖర్చు సంగతి ఎలావున్నా, ముందు ఇంట్లోవాళ్ల అడ్డంకులు ఎక్కువ, అదేదో చేయగూడని పని అన్నట్టు.

క్రికెటు ఆటలోలా ఇన్ని ఓవర్లలో గెలవాలన్న నియమముంటే బాగుణ్ణు. ఇరవై ఓవర్లో, ఐదు రోజులో- ఆడాల్సిన ఓవర్లు మిగలకపోతే ఓటమని నిర్ధారణ అయిపోతుంది. అది క్రుంగదీస్తుందో, రాటుతేలుస్తుందో తర్వాతి సంగతి. ఆశ నిరాశల ఈ ఊగిసలాట ఎన్నాళ్లో అతనికి అర్థంకాలేదు.

మ్యూట్ చేసిన టివిలో కూడా చర్చలో గొంతు చించుకొని అరుచుకుంటు న్నారని తెలుస్తోంది. కాసేపు ట్విట్టర్‌లో తచ్చాడాడు. టెక్, బిజినెస్, స్పోర్ట్స్, సినిమా, ట్రోల్స్, మీమ్స్ అన్నీ కలగలుపుగా చదివాడు. 'యు హావ్ ఎ మెమరీ' అంటూ ఫేస్‌బుక్, అటెన్షన్ కోసం తపిస్తూ. తెరిచి చూస్తే నాలుగేళ్ల క్రితం యూరప్‌లో స్కైడైవింగ్‌కి వెళ్లినప్పటి ఫోటో. ఆమె యూరపులో ఉన్నప్పుడు అతను యూఎస్ నుండి సెలవు పెట్టుకొని వెళ్లాడు. అతను ఎక్కడ జారిపడతానో అన్నట్టు భయ భయంగా చూస్తూ ఇబ్బందిగా నవ్వుతూ ఆమె భరోసాగా, మొహమంతా నవ్వుతో బొటనవేళ్లు ఎత్తి చూపిస్తూ. ఆమె ప్రొఫైల్‌కి వెళ్లాడు. మూడేళ్ల నుండి ఏ ఆక్టివిటీ లేదు. 'ఎక్కడున్నావే? ఏం చేస్తున్నావ్?' అన్న పోస్టులకి సమాధానం లేదు.

ఇంకాసేపు ఫేసుబుక్‌లోనే పొలిటికల్ మీమ్స్, కొత్తగా రిలీజైన తెలుగు సినిమా గురించి ఎడతెగని చర్చలు, రైట్ వింగ్-లెఫ్ట్ వింగ్ గలాటాలు, పిల్లల్ని ట్రోఫీల్లా ఎత్తుకొని ముద్దుపెట్టుకునే ఫోటోలు, పిల్లల్ని పెంచడమెంత కష్టమో అంటూ మురిసి పోతున్న తల్లిదండ్రుల పోస్టులూ చూశాడు.

తొమ్మిదింటి వార్తలే పదకొండింటి బులెటిన్లో చదువుతున్నారు. అతడికి కళ్లు గుచ్చుకుపోతున్నాయి. టి.వి. ఆఫ్ చేసి కళ్లు నలుపుకుంటూ బెడ్రూమ్‌లోకి వెళ్లాడు. అతడి పక్కవైపు బెడ్ లైట్ తప్పించి, గదంతా చీకటిగా ఉంది. అతడు చప్పుడు చెయ్యకుండా వీలైనంత నెమ్మదిగా మంచం ఎక్కాడు. ఆమె గాజులు కదిలాయి.

దుప్పటి కింద ఆమె గాజులు చేస్తున్న శబ్దం బట్టి ఆమె నాడా విప్పుతోందని అతనికి అర్థమయ్యింది. చీకట్లో ఆమె కాళ్లు దగ్గరకు తీసుకుని పెట్టి పైజామా కిందకి లాగుతోందని తెలిసింది. అతడు లైటు ఆర్పి, అటు తిరిగి పడుకున్నాడు.

గదిలో గడియారం మాత్రమే ఉన్నట్టనిపించింది. భుజం మీద మెల్లగా ఆమె చేయి పడింది.

''ప్లీజ్ గిరీ! ఈ సైకిల్‌లో ఇంకా రెండు రోజులే ఉన్నాయి!''

ఆమె కన్నీళ్లలో తడిసిన మాటలు అతడిని నిలువనివ్వలేదు. ఆమె వైపుకు తిరిగాడు.

''సారీ. నేను కోపం తెచ్చుకోకుండా ఉండాల్సింది.''

తల నిమిరేకొద్దీ ఆమె కన్నీళ్లు ఎక్కువయ్యాయి. అతడు ఆమెకు దగ్గరగా జరిగాడు. కాలిపై కాలు వేసి హత్తుకున్నాడు. ఆమె అతన్ని దగ్గరగా తీసుకుంటూ వెనక్కి వాలింది. మీదకు వంగి ముద్దుపెట్టుకున్నాడు, ఆమెను చుట్టిన చేతితో తల

నిమురుతూనే. ఆమె భుజంలో తలను దాచుకున్నాడు. ఆమెకి అర్థమయ్యింది. సుతారంగా వీపుని నిమిరింది.

కొన్ని నిమిషాల తర్వాత, భుజం పైకి ఎత్తింది ఆమె, అతడిని కదిలించడానికి.

"ఇంకా రెండే రోజులు, గిరీ! ప్లీజ్!"

"నా వల్ల కాదు!" అతడి గొంతుకి ఆమె ఉలిక్కిపడింది. అతడు ఆమె మీదుగా మంచం దిగేశాడు.

"ఈ 1-2-3 సీక్వెన్స్ నా వల్ల కాదు. ఐ కెన్ మేక్ లవ్, కానీ ఇలా డ్రిల్‌లా కాదు," బయటకు అనకూడదు అనుకుంటూనే అనేశాడు.

అతడు లైట్ వేశాడు. ఆమె దుప్పటి పైకి లాక్కుంది.

"నీకేం? నీ టెస్టులు ఫెయిల్ అయ్యుంటే తెలిసేది."

అతడు ఒక్క అంగలో ఆమె దగ్గరకు వచ్చి, బుగ్గ గట్టిగా వత్తుతూ, "సో! ఇది నీ టెస్టులు నా టెస్టులు గురించా? చెప్పు?!" అంటూ గద్దించాడు. ఆమె గొంతులో వినిపించిన నొప్పి మళ్లీ అతన్ని దూరంగా నెట్టింది.

ఆమె దుప్పటిలో డ్రెస్ సర్దుకుంది. జుట్టు ముడివేసుకుంది. దుప్పటిని పక్కకు తోసేసింది.

"చూడూ, ప్రతీ రాత్రి ఐ కాంట్ గో త్రూ దిస్ షిట్. ఇలా డెడ్‌లైన్‌ల టార్చర్ నా వల్ల కాదు."

"ఆ సంగతి మీ అమ్మకు చెప్పు," ఆమె మంచం మీద నుండి లేచింది.

"మా అమ్మను తీసుకురాకు మధ్యలో!"

అతడిని దాటుకుంటూ ఆమె వార్డ్‌రోబ్ వైపుకి విసవిసా వెళ్లింది. మూలన తాళం వేసున్న ఒక తలుపును తీసి, "ఏంటి? మీ అమ్మను తీసుకురావద్దా?" అంటూ అందులో ఉన్న బొమ్మలన్నీ తీసి ఒక్కొక్కటీ బయటకు పారేసింది.

"మా అమ్మది మనవల కోసం ఆరాటం అంతే! ఏం, మీవాళ్లు మాత్రం గొలుసు, మురుగులు చేయించలేదా?"

"మీ వాళ్లు. మా వాళ్లు. అంతా వచ్చి నా నెత్తి మీద కూర్చోండి. నా కడుపులో నలుసు నిలవడం లేదు, నన్ను పొడిచి పొడిచి చంపండి అందరూ," అంటూ తలను గోడకు కొట్టుకుంది.

అతడు ఒక్క అంగలో బొమ్మలను దాటుకుంటూ ఆమె దగ్గరకు వెళ్లాడు.

"చిత్రా, ఏం చేస్తున్నావు. ఏంటిది?" ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

"నేను చావను కూడా చావడం లేదు," అతడిని విడిపించుకుంది చేత్తో నుదురు గట్టిగా కొట్టుకుంటూ, పెద్దగా ఏడుస్తూ.

"షటప్! జస్ట్ షటప్!" అంటూ ఆమె భుజాల్ని గట్టిగా కుదుపుతూ ఆమెను సగం తెరిచిన తలుపు మీదకు తోశాడు. "నిజంగానే చంపేస్తాను! ఆ మాట ఇంకో సారి వినిపిస్తే!" తలుపు మెల్లగా మూసుకుంది.

"నాకు పిల్లలు వద్దు గిల్లలు వద్దు. నువ్వు కావాలి."

ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

"నాకు కావాలి, గిరీ! నాకెందుకు పిల్లలు పుట్టరు? నేనే పాపం చేశాను గిరీ?"

అతడు ఆమె ఎదురుగా మోకాళ్ల మీద కూర్చున్నాడు. ఆమె భుజాలపై చేతులుంచాడు.

"గాడ్ ప్రామిస్! ఇలా అవుతుందని తెలిస్తే నువ్వు ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చేదాన్ని నా ఉద్యోగం నా కెరీర్ అని నేను," ఆమె వెక్కిళ్ల మధ్యలో ఆగాగి అంటున్న మాటలు ఏరుకొని పేర్చుకున్నాడు.

అవి అర్థమయ్యి తల అడ్డంగా ఆడించాడు.

ఆమె కళ్లల్లోకి చూస్తూ, "వి డోంట్ డిజర్వ్ దిస్! నాట్ ఎట్ ఆల్!" అన్నాడు.

"నావల్లే నీకీ కష్టం!" ఆమె నోటిని చేత్తో మూశాడు. మొహం మీద పడుతున్న జుట్టును పక్కకు తోశాడు.

"ఎవరి వల్లయితేనేం. ఇది మన కష్టం. నీదీ నాదీ కాదు! ఏం? ప్రాబ్లమ్ నాలో ఉండుంటే?" ఆమె జుట్టును సవరిస్తూనే ఉన్నాడు.

"నేను అమ్మను కాలేనా, గిరి? ఎప్పటికీ కాలేనా?" అతడి షర్ట్ ఆమె గుప్పిట్లో నలిగిపోయింది.

"డాక్టర్లు చెప్పినట్టు ప్రయత్నిద్దాం, సరేనా. కానీ దానికోసం మనం ఇలా అయిపోగూడదు. మీవాళ్లు మావాళ్ల కోసం కాదు, ఇంక ఎవరికోసమూ కాదు. మన కోసం. ఎందుకంటే నాకు నువ్వు ముఖ్యం. మనం ముఖ్యం," అంటూ ఆమెను మరింత దగ్గరకు తీసుకుంటూ వార్డ్‌రోబ్ తలుపుకు ఆనుకుని కూలబడ్డాడు.

పాత బొమ్మ ఒకటి, కాలి కిందపడి కొన ఊపిరితో ఉన్న బాటరీ వల్ల కుయ్యిమంది. అతడు దాన్ని కాలితో పక్కకు తోసేశాడు.

*ఈమాట అంతర్జాల పత్రిక*
*జులై 2018*

*



**పూర్ణిమ తమ్మిరెడ్డి** ఊహలన్ని ఊసులై అనే బ్లాగుతో రాయడం మొదలుపెట్టారు. వీరి మొదటి కథ ఒక కథ చచ్చిపోయింది పొద్దు అంతర్జాల పత్రికలో, 20 ఏప్రిల్ 2010లో వచ్చింది. పదేళ్లుగా పుస్తకం.నెట్ నిర్వహణ బాధ్యతలు పంచుకుంటున్నారు. ప్రస్తుతం ప్రముఖ ఉర్దూ రచయిత సాదత్ హసన్ మంటో రచనలు తెలుగులోకి అనువదిస్తున్నారు. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

**చిరునామా:** **డోర్ నెం. 432, ఫస్ట్ ఫ్లోర్, ఫస్ట్ బి క్రాస్, 8వ అంతస్తు**
**కోరమంగళ, బెంగళూరు - 560 095**
***ఫోన్: 9701201144*** **purnimat07@gmail.com**